మట్టిలో చేరి ఇనుము పట్టు తుప్పు
అగ్నిలో చేరి ఇనుమున అదియు వీడు
సాహచర్యముచే నిట్లు జరుగుచుండు
ఇసుకలో జలధార ఇంకి పోవు
మధురమై నిల్చు రేగడి మసకనేల
అటులె ప్రాప్తాను సారమై అలరు భక్తి

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా!

మానవత్వము ఎంతో పవిత్రమైనది. అయినప్పటికి తన సహవాసము పురస్కరించుకొని తన యొక్క మంచి చెడ్డలు మారుతూ ఉంటాయి. ఇనుము మట్టిలో వేసినప్పుడు తుప్పు పడుతుంది. కానీ అదే ఇనుము అగ్నిలో వేసినప్పుడు ఆ తుప్పు వదలిపోయి ప్రకాశవంతముగను మెత్తగను మారుతుంది. దుమ్ము గాలిలో చేరితే గగనం వరకు ఎగురుతుంది. కాని నీటితో చేరితే లోతట్టుకు చేరుతుంది. పైకి ఎగురుటకు రెక్కలు లేవు దానికి. క్రిందకు దిగుటకు కాళ్ళు లేవు. సహవాసప్రభావము చేతనే పైకి ఎగరటం క్రిందికి దిగటం జరుగుతూ ఉంటుంది. కనుక సహవాస దోషము, సహవాస మేలు అని మనం సహవాసం చేసే వారి మంచి చెడ్డలపై ఆధారపడి ఉంటుంది.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః.

సత్సంగము మనము చేసినప్పుడు ఎంతో పవిత్రమైన దివ్యత్వాన్ని అందిస్తుంది. దుస్సంగములో చేరినప్పుడు దురాలోచనలు, దుశ్చింతలు మనసులో ప్రవేశించి అనేక విధములైన దుష్కృత్యాలను పురికొల్పుతుంది. కనుక మానవుడు సత్సంగముతో చేరి మానవత్వము అభివృద్ధి పరచుకోటం అత్యవసరము. సత్సంగము చేత మానవుడు దైవత్వమును పొందగలడు. దుస్సంగము చేత పశువుగా మారగలడు. పశుత్వము మానవుని కంటె క్రిందిస్థాయి. దైవత్వము మానవునికి పైస్థాయి. మానవత్వము మధ్యస్థాయిలో ఉంటున్నది. ఇట్టి మధ్యస్థాయిలో నున్న

మానవత్వాన్ని ఉన్నత స్థాయికి గొని పోవుటకు ప్రయత్నించాలిగాని అధోస్థాయికి స్థాయికి దిగజారుటకు ఏ ప్రయత్నము చేయనక్కరలేదు. పడిపోటం చాలా సులభము. ఉన్నత స్థాయి అందుకోటం చాలా కష్టము. మానవుడు కష్టమైనప్పటికి ఉన్నత స్థాయికి చేరుకోటానికి పూనుకోవాలి. మానవుడు దుస్సంగము చేత తన భావములు దుర్భావములుగా మార్చుకొని తన చర్యలను దుశ్చర్యలుగా మార్చుకొని కడపటికి దురవస్థలకు గురౌతున్నాడు.

అన్నింటికి సంకల్పములే మూలకారణము. ఈ సంకల్పములు సత్యమైనవిగా, శుద్ధమైనవిగా, సార్థకమైనవిగా, పవిత్రమైనవిగా ఉండాలి. కాని నేటి వయస్సునందే దురదృష్టవశాత్తు దుస్సంగతులు, దురాలోచనలు, దుశ్చర్యలలో పాల్గొని మానవుడు ఈ వయస్సును వ్యర్థము గావించుకుంటున్నాడు. Iron కూడా dust కంపెనీ వల్ల rust గా మారుతుంది. ఈ rust కావటం వలన ironలో ఉండే శక్తి అంతా burst అయిపోతుంది. ఈ burst అయినప్పుడు test చేయవలసి వస్తుంది. test చేసినప్పుడే దీనికి rest చిక్కుతుంది. ఈ rest మనకు ఉన్నత స్థానము. అనగా దీనికి పట్టిన dust ని మొదట తుడిచి వేయాలి. ఏమిటి ఈ dust. దుస్సాంగత్యము లో ఏర్పడిన దుర్భావములనే rust మనం తుడిచి వేయాలి. ఇవన్నీ దుస్సాంగత్యము లో ఏర్పడతాయి. మన కంపెనీ ఎలాంటిదో మనము అలాంటి వారుగా తయారౌతాము. మనం కాలం తీసుకున్నా తప్పు లేదు కొంత విచారణ చేసి మంచి వారిలో స్నేహము చేయాలి. మనం మంచిస్థితిలో నున్నప్పుడు, మంచి స్థాయిలో నున్నప్పుడు అందరు దగ్గరకు వస్తుంటారు కాని మన పరిస్థితి దిగజారినప్పుడు, హీనస్థితికి వచ్చినప్పుడు, కొన్ని విధమైన ప్రాభవములను కోల్పోనప్పుడు అందరూ దూరమై పోతారు. ఇది నిజమైన స్నేహము కాదు. స్నేహమనగా ఏమిటి? ఆపద సమయమందు, దుఃఖ సమయమందు, విచార సమయమందు, ఇక్కట్లు కలిగినప్పుడు మనలను వీడక నీడవలె మనలను వెంటాడుతూ ఉండాలి. వారే నిజమైన మిత్రులు. చెరువునందు నీరుండినప్పుడు వేలకొలది కప్పలు చేరుతుంటాయి. కాని నీరు ఎండిపోగానే ఒక్క కప్ప అయినా అక్కడ ఉండదు. కనుక నిజమైన స్నేహితుడు ఎవరని మనం కాలము తీసుకొని గుర్తించి అలాంటి వారితో స్నేహం చేయాలి. కేవలం హలో అంటే హలో అనే వారితో చేరటం తప్పు. స్నేహం చేయ తలచిన వారి back ground అంతా మొదట చక్కగా విచారణ చేయాలి. వారి habits ఎలాంటివి, వారి behaviour ఎలాంటిది, వారి discipline

ఎలాంటిది అనే వాటిని మొట్టమొదట గుర్తించాలి. వారు ఎలాంటి వారితో చేరుతున్నారు, ఎలాంటి సంగముతో ఉంటున్నారు మనం గుర్తించాలి. వాడు చెడు కంపెనీతో చేరుతున్నప్పుడు వాని ముఖము కూడా మనం చూడకూడదు. హలో హలో అన్న మనం good bye చెప్పి వెళ్ళిపోవాలి. అలాంటి వారి స్నేహము మన జీవితానికి ముప్పు.

కాని ఈనాటి విద్యార్థులు లోకసంబంధమైన విద్యల వల్ల అందరు స్నేహితులుగానే మారిపోతున్నారు. ఇది నిజమైన మిత్రత్వము అని చెప్పుటకు వీలుకాదు. కదలిపోయే మేఘములు. ఏ నిముషములో విడిపోతుందో. అలాంటి స్నేహము ఎంతవరకో అంతవరకే. హలో అంటే హలో good bye- good bye అని చెప్పి ముగించుకోవాలి. ఇంతేకాకుండా ఈ వయస్సులో విద్యార్థులకు గుణం చాలా ప్రధానమైనది. అది లేకపోతే ప్రాణము పోయిన ఒక శవమే. character లేని వానితో స్నేహము చేయకూడదు. అలాంటి వారికి individual character ఉండదు. సామాజిక character ఉండదు. ఈ సామాజిక character లేనప్పుడు national character ఎలావస్తుంది? మొట్టమొదట మన వ్యక్తి Individual character ఉండాలి. అనగా చలించని మనసును భ్రమించని దృష్టిని మనం అలవరచుకోవాలి. ప్రతిదానికి గడియారము పెండ్యులమువలె అటూ ఇటూ కదులుతూ ఉంటే అలాంటి వాని ముఖమే చూడకూడదు. అలాంటి వానితో ఏ మాత్రం స్నేహము చేసుకోకూడదు. కడపటికి నీవు కూడా bad అయిపోతావు. కనుక మనం మంచివారితో స్నేహం చేయుటానికి ప్రయత్నం చేయాలి. ఇనుము మట్టిలో చేరినప్పుడు తుప్పుపట్టి దాని శక్తి కోల్పోతుంది. ఇనుము గట్టిగా కఠినంగా ఉంటుంది. అదే నిప్పులో చేరేసరికి ప్రకాశవంతముగా మారుతుంది. చేతిలో కొట్టినా సాగుతుంది. సత్సంగములో చేరినప్పుడు అగ్నిలో చేరినట్లుగా హృదయం పవిత్రము అవుతుంది. rust ఎప్పుడు విడిపోతుందో తాను పరిశుద్ధముగా ఉంటుంది. ఎప్పుడు పరిశుద్ధమవుతుందో అప్పుడు తగిన రీతిలో చేసుకోవచ్చు. అట్టి ఇనుమును ఏ ఆకారములో నయినా semi circle గాను, circle గాను చేసుకోవచ్చు. కనుక ప్రతి మానవుడు సంస్కరింపబడాలి.

సంస్కరింపబడటం అంటే ఏమిటి? దానిలోని మాలిన్యము వేరుచేయటం. గుణాన్ని పోషించుకోటం. ఈ జగత్తులో మనం తినే పదార్థములన్నీ సహజంగా సృష్టింపబడుతున్నాయి. బియ్యం తింటున్నాము. గోధుమలు తింటున్నాం. ఇంకా అనేక రకముల పదార్థములన్ని తింటున్నాము వాటిని పుట్టినవి పుట్టినట్లుగా మనం భుజించము. వడ్లు పండుతాయి. గడ్డిని మనం వేరు

చేయాలి. విరిగి వడ్లనుండి పై పొట్టును వేరు చేయాలి. ఈ పొట్టును వేరుచేశాకనే బియ్యముగా మారతాయి. అగ్ని సంస్కారమైన తరువాతనే మనం తినటానికి వీలవుతుంది. అదే విధంగా వెండిగాని బంగారుకాని, వజ్రముకానీ ఏదైనా పుట్టినది పుట్టినట్లుగా మనం అనుభవించటానికి వీలుకాదు. ఇవన్నీ మట్టితో కూడి ఉంటాయి. వాటిని పరిశుద్ధము చేసి అగ్నిసంస్కారము చేత కొంతవరకు పరిశుద్ధమైనదిగా చేసుకోవాలి. అప్పుడే దానినుండి ఏమైనా మనము చేసుకోవచ్చు. కనుక ప్రతిదానికి సంస్కారము ఉంటుంది. ఈ బట్ట ఉంది. దానికి మూలము పత్తి. ఆ పత్తిలో విత్తనాలు యింకా యేమేమో ఉంటాయి. ఆ పత్తిని మనం దారం చేసుకోవాలి. దారమును నేసినప్పుడే వస్త్రముగా తయారౌతుంది. ఈ వస్త్రము తయారగుటకు అనేక సంస్కారములు జరగాలి. అప్పుడే మనం అనేక అనుభూతులు అనుభవించవచ్చు. ఈనాడు మీరు చదివే చదువున్నీ కేవలం bookish knowledge. చదువుకు సంబంధించిన సంస్కారం కూడా ఉండాలి. ఎంత చదువు చదివినా సంస్కారము లేని చదువు చదువే కాదు.

ఎంత చదువు చదివి ఏ రీతి ఉన్నను
హీనుడవగుణంబు మానలేడు
తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణ జ్ఞానమెపుడు పొందలేడు.

మనము ఈ విధమైన చదువు చదివి తర్కవాదములతో ప్రవేశిస్తున్నాము. ఇది కాదు చదువు యొక్క విలువ. చదువు కేవలం పొట్టకూటి కోసం చదివేది కాదు. కృషి కూటి కోసం. విద్య విజ్ఞానం కోసం. ఇది పెడ మార్గం పట్టించి విద్య కేవలము జీవనోపాధి నిమిత్తమని భావిస్తున్నాము.

జీవితములో రెండు మార్గాలున్నాయి. ఒకటి జీవనోపాధి. రెండవది జీవిత పరమావధి. జీవనోపాధితో బాటు జీవిత పరమావధిని కూడా గుర్తించాలి. ఏదో మనం ఉన్నంతవరకు జీవించి కడపటికి మరణించవచ్చు. ఇది కాదు మానవుని ప్రధానలక్ష్యము. ఆదర్శమైన జీవితాన్ని అందరికి అందించాలి. ప్రతి మానవుడు కూడా ఆదర్శవంతుడుగా మారాలి. మనిషి మరణించినా ఆదర్శములు మారకూడదు. ఉత్తమ ఆదర్శములందించే విద్యార్థులుగా తయారు కావాలి. ఈ ఆదర్శములు మార్పు చెందేవి కావు. అవి చిరంజీవి తత్త్వము. జన్మజన్మ

లందు ఈ ఆదర్శములు అనేకరకములుగా ఇతరులు పాటించవచ్చు. కనుక ఆదర్శ జీవితమును పాటించాలి. మానవునికి ఆదర్శవంతమైన జీవితమంటే ఏమిటో తెలియదు. కేవలం డిగ్రీలు తీసుకోగానే నేను గొప్ప చదువరినని, గొప్పవాడినని అహంకారమునకు అవకాశము ఇస్తున్నాడు ఈ అహంకారము, ఆడంబరము, అసూయ ఈ మూడు ఉన్నంతవరకు ఈ మానవుడు జగత్తులో యేమాత్రము ఉపయోగము లేదు. కనుక సమాజము కూడా ఇలాంటి వారిని గౌరవించదు. ఇంటిలో గౌరవిస్తారు మూర్ఖుని. గ్రామములో గౌరవింపబడతాడు గ్రామాధిపతి. దేశము గౌరవిస్తుంది రాజుని. కాని సంస్కారవంతుని ప్రపంచమే గౌరవిస్తుంది. కనుక మొట్టమొదట మన సంస్కారమును మన భారతీయ సంస్కృతిని చక్కగా కాపాడుకొనుటకు కృషి చేయాలి. ఏ దేశము యొక్క సంస్కృతిని ఆ దేశీయులు కాపాడుకోవాలి. ఇది నిజమైన విద్యయొక్క విశిష్టత.

ముఖ్యముగా ఈ నాడు మనం సంబంధ బాంధవ్యాలను సరైన రీతిలో తీసుకోవాలి. ఎవరిని ద్వేషించనక్కరలేదు. కాని నీవు ఎన్నుకోవలసిన వారిని సరైన రీతిలో ఎన్నుకోవాలి. నీవు స్నేహితుడు కావాలంటే మూర్ఖుని స్నేహితుడుగా చేసుకోటం కంటె ఏ స్నేహితుడు లేక పోవటమే మంచిది. కనుక నీవు సరైన స్నేహితుని ఎన్నుకోవాలి. ఎటువంటివాడు. త్రికరణ శుద్ధి కలిగినవానిని ఎన్నుకోవాలి. మనసులో ఒకటి, మాటలో మరొకటి, చేతలలో ఇంకొకటి చేసే వారిని ఏమాత్రం దగ్గర రానీయకూడదు. ఇతరుల మన ప్రభావములను గుర్తించటానికి మనం ప్రయత్నించటంలేదు ఒక చిన్న ఉదాహరణ. మనిషియొక్క భావములు కుక్కలు కూడా కనిపెడుతున్నాయి. కాని మానవుడు తన భావములను తాను కనిపెట్టలేక పోతున్నాడు. ఒక కుక్క ఇరవై అడుగుల దూరములో ఒక గుంటలో పడుకుంది. దానిని దాటుకొని వెళ్ళు. అది ఏమాత్రము అభ్యంతరము చేయదు. దానిని కొట్టాలని సంకల్పం చేసుకొని చిన్నరాయి తీసుకొని పో నిన్ను చూసి అది పరుగెత్తుకొని పోతుంది. నీ సంకల్పము అది గుర్తిస్తున్నాది. మానవుని సంకల్పములు కుక్కలు గుర్తిస్తున్నాయిగాని మానవులే గుర్తించటం లేదు. మనము DOG కాకూడదు. GOD గా తయారు కావాలి. నీవు D entrance లో పోవద్దు. G entrance లో పో. ఇది మొట్టమొదటి క్వాలిటీ. ఇదియే సాధనకు మూలము. ఏమిటి సాధన? జపము చేయటము తపము చేయుటము కాదు సాధన మొట్టమొదట సత్యమును గుర్తించాలి.

న తపాంసి న తీర్థానాం న శాస్త్రాణి జపానహి
సంసార సాగరోద్ధార సజ్జనం సేవనం వినా.

సజ్జనుని సేవలు చేయాలి. తల్లి తండ్రి గురువు వీరందరిని గౌరవించి సేవించు. పరిచర్యలు చేయి. అంతేగానీ పెద్దలను ధిక్కరించి తల్లితండ్రుల మాటలు విస్మరించి నీవు ఏదో గొప్ప సాధన చేస్తున్నా వంటే ఇది సాధన కాదు. దీనిని భగవంతుడు అంగీకరించడు. జీవులను హింసించటము దైవము ను పూజించటము దైవము కూడా ఇష్ట పడడు. మొట్టమొదట జీవులను ప్రేమించు. అప్పుడు దేవుని ప్రేమించిన వాడవౌతావు. భగవంతుడు అన్ని భూతములందు ఉంటున్నాడు. మనము సరైన భావము చేత సరైన వ్యక్తులను సరైన రీతిలో గౌరవించాలి. అయితే శ్రేయస్సు కోసమని కొన్ని నియమములు పాటించాలి. గుణములు సరిలేనిచో మనము ఏమి సంబంధము పెట్టుకో కూడదు. అయితే అందరికీ నమస్కరించు. విద్యార్థిగా ఉండినప్పుడు ఇతరులసంబంధము మనము ఏమాత్ర ము పెట్టుకో కూడదు. విద్యార్థులు, విద్యార్థినులు ఉంటున్నారు. boys girls లో connection పెట్టుకుంటే వాడు కుక్కకంటె హీనమే. విద్యార్థిగా నున్నప్పుడు ఈ విధమైన పెడమార్గము పడితే కుక్కలకంటె హీనమై పోతావు. తల్లిదండ్రులను మోసము చేసిన వాడవౌతావు. అలాంటి తల్లిదండ్రు ల గర్భములో పుట్టి వ్యర్థమై పోతున్నావు. అలాంటి జన్మయే వ్యర్థమై పోతుంది. అలాంటి జీవి తము మనకు ప్రయోజనం లేదు. ఎలాంటి జీవితము ఉండాలి.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా తలపడేని
కలుగనేటికి తల్లుల కడుపుచేటు

చదివినందుకు ఏమి కావాలి. సరైన సద్గుణములు మనలో ఆవిర్భవించాలి. అదే మన చదువుకు అంత రార్థము.

పుస్తకముల నిండ మస్తుగా చదువుండె
మస్తకముల నిండు మట్టి మెండు

ఏమి ప్రయోజనము పుస్తకములలో ఉంటున్నది చదువంతా. తలలో ఉంటున్నది మట్టి అంతా. ఇది చదువా. కాదు కాదు. తలలో నున్న [illegible] ని దూరం చేయాలి.

08079607

ఏమి లేని బుజ్జిలోన ఏమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండియున్న బుజ్జి నింప వీలుకాదు
కలిభోధలు నిండియున్న తలబుజ్జది ఖాళియగునా
తలబుజ్జది ఖాళీకాక ఇల సుకృతము నింప నగునా.

టంబ్లరులో నీరుంది. దానిలో పాలు పోయాలంటే ఎట్లా పోస్తావు. ముందు నీరు పారపోయాలి. తరువాత పాలు పోయాలి. నీటిలో పాలుపోస్తే రెండు భ్రష్టుపట్టిపోతాయి. మన హృదయములో పవిత్రమైన భావములు, తల్లిదండ్రులను ఆనందపెట్టే భావములు తగిన కృతజ్ఞత చూపే భావములు మొదలు ఆవిర్భవించాలి. తల్లిదండ్రులను మోసం చేసి నీవు పెడమార్గం పడితే నీకంటె దుష్టుడు మరొకడు లేడు. చదువులు చదివి ఏమి ప్రయోజనం లేదు. చదువులు చదివే బదులు ఇంటింట పోయి బిక్షమెత్తుకోవచ్చు. మొట్టమొదట గుణములను సాధించాలి.

గుణము లేని సుతుడు గుణిలేని విద్యలు
నీతిలేని జాతి నిష్ఫలంబు
శాంతిలేని జీవి శశిలేని నిశిరాత్రి.

ఏమి ప్రయోజనము? గుణమును చదువు ద్వారా పెంచుకోవాలి. మీరే ఈ దేశమునకు తగిన నాయకులుగా అభివృద్ధి కావాలి. భావి భారతోద్ధారకులు మీరే. ఇలాంటి యువకులు సరైన మార్గములో లేకపోతే దేశమంతా పాడైపోతుంది. మొక్క సొట్టగా అయితే చెట్టంతా సొట్ట అవుతుంది. విద్యార్థులు దేశ మునకు పునాది వంటివారు.

జీవితమనే భవనమునకు విద్యార్థులు పునాది వంటివారు. అదే బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యమనే పునాదిపై గృహస్థమనే గోడ కడుతున్నాం. దానిపై వానప్రస్థమనే మరొక ఫ్లోరు వేస్తున్నాము. చివరి ఫ్లోరు సన్యాసము. నాలుగు అంతస్థుల భవనము. దానికి పునాది బ్రహ్మచర్యము. ఇది సరిలేకపోతే భవనము కూలిపోతుంది. కనుక పునాది భద్రముగా చూసుకోవాలి. ఈ వయస్సు చాలా గొప్పది. చాలా పవిత్రమైనది. golden age. పిల్లలు చాలా గుణవంతులుగా ఉండాలి. చూపులందు శ్రవణమందు, మాటలందు, చర్యలందు అన్నింటియందు పవిత్రముగా ఉండాలి. మొట్టమొదట భగవత్ప్రేమ పెంచుకోండి - దానిని నింపుకున్నప్పుడు హృదయములో, ఇంద్రియములన్నీ taps. అన్ని ఇంద్రియముల ద్వారా మంచి నీరే వస్తుంది. ప్రేమ అనే నీరే వస్తుంది. మన హృదయము ఎటు

వంటిదో మన చర్యలు అటువంటివి. హృదయము ప్రేమ లో నింపుకుంటె చర్యలన్నీ ప్రేమ గానే ఉంటాయి. బావిలో రాయి వేస్తే బావిఅంతా అల ప్రారంభమవుతుంది. ఆ అల ఎంతవరకు పోతుంది- బావి ఎంతవరకు ఉందో అల అంతవరకు పోతుంది. ఇదే విధముగా నీ మానస సరోవరములో చెడ్డ తలంపులో, మంచి తలంపులో అనే రాయి విసురుతే దేహమంతా పాకిపోతుంది. చేతులంతా చెడ్డనే చేస్తాయి. కన్నులంతా చెడ్డనే చూస్తాయి. చెవులు చెడ్డనే వింటాయి. మాటలంతా చెడ్డగానే వస్తాయి. కాళ్లు చెడ్డ ప్రదేశమునకే వెడతాయి. తలనుంచి పాదముల వరకు ఇవే thoughts పాకి పోతాయి. కనుక హృదయము చాలా ప్రధానమైనది. ఈనాటి విద్యార్థులు art ని చూస్తున్నారుగాని heart ని చూడటం లేదు. heart is inside, art is out side. heart అంటా పారమార్థికము నివృత్తి తత్త్వమే పరిపూర్ణమైనది పరిశుద్ధమైనది. దీనికి చిత్తశుద్ధి ఉండాలి. మనం చేసే కర్మలు చిత్త శుద్ధిలో చేయాలి.

ఎన్ని జన్మల ఫలమో అందించి ఈ జీవిత మనే దానిని కొనుక్కున్నాము. ఈ మానవత్వాన్ని పెడ మార్గం పట్టకుండా చూసుకోవాలి. మానవుడు మానవునిగానే బ్రతకాలి. మానవుడు పశువుగా బ్రతకకూడదు. మానవుడు దేవుడు కానక్కర లేదు. మానవుడు మానవుడుగా బ్రతికితే చాలు. ఇదే మొట్టమొదట విద్యార్థులనాడు నేర్చుకోవలసినది. బయట ప్రపంచమంతా అనేక విధములైన రీతులలో ప్రవర్తిస్తున్నది. కనుక వారి మంచిచెడ్డలు మనం విచారించనక్కర లేదు. మన మంచిని మనం చూసుకోవాలి. నలో ఏ చిన్న తప్పు వచ్చినా అది పెద్దదిగా భావించు. అంతేగాని పరులలోనున్న చిన్న దోషాన్ని పెద్దదిగా భావించకు. మొట్టమొదట మనలోనున్న దోషములను మనము నిర్మూలము గావించుకోవాలి. అప్పుడే మానవత్వము వికసింపచేసుకున్న వారమవుతాము.